
# సున్నపు గనుల లీజుపై చేతులెత్తేసిన కేంద్రం

**సూర్యాపేట జిల్లా లీజు వేలంపై పీఎంవోకు సామాజిక కార్యకర్త ఫిర్యాదు**

- 3 నెలల తర్వాత స్పందించిన గనుల శాఖ
- తిరిగి తెలంగాణ రాష్ట్ర గనుల శాఖకు ఫిర్యాదును పంపుతున్నట్టు సమాధానం
- అటవీశాఖ ఎన్‌వోసీ లేకుండానే గనుల ఈ-వేలం
- స.హ. చట్టం కింద సమాధానమిచ్చిన సూర్యాపేట జిల్లా అటవీ శాఖ



| | Certified copies all above (3) Lime stone Mineral Blocks Details mentioned below. | |
|---|---|---|
| 1 | DGBS corner points Details along with Demarcated Area Map | DGPS points along with Attested map enclosed herewith |
| 2 | Compartments details with Topo Sheets with GSI Maps | Gap areas identified by the Mining Dept is only attested without any compartment numbers in the Map enclosed above. |
| 3 | Telangana State Forest Department Detailed report above three block wise details & Forest Department No Object Certified copies. | From this Office gap areas with attested on Maps sent with covering letter to Ast. Director of Mines, Suryapet and any No Obejction Certificate not issued from O/o District Forest Officer,Suryapet. |

Yours faithfully,
(R. Sujatha)
I/c Public Information Officer,
O/o the District Forest Officer,
Suryapet.

ఎన్‌వోసీ ఇవ్వలేదంటూ సూర్యాపేట డీఎఫ్‌వో స.హ. చట్టం కింద ఇచ్చిన సమాధానం

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మే 16 (నమస్తే తెలంగాణ): సూర్యాపేట జిల్లాలో మూడు సున్నపురాయి గనుల వేలంలో జరిగిన అవకతవకలపై కేంద్రం చేతులెత్తేసింది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా ఈ-వేలం నిర్వహించారంటూ సామాజిక కార్యకర్త ఒకరు కేంద్ర గనుల మంత్రిత్వ శాఖకు ఫిర్యాదు చేశారు. దీనిపై మూడు నెలల తర్వాత స్పందించిన సంబంధిత శాఖ అధికారులు ఆ ఫిర్యాదును తిరిగి తెలంగాణ గనుల శాఖకే పంపినట్టు సమాధానం ఇవ్వడంతో సదరు కార్యకర్త విస్మయం చెందారు. తాను ఎవరిపై ఫిర్యాదు చేశానో వారికే తన ఫిర్యాదును పంపి చేతులు దులుపుకోవడం ఏమిటని ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. తెలంగాణ గనుల శాఖ.. అటవీ శాఖ నుంచి ఎలాంటి నిరభ్యంతర ధ్రువీకరణ లేకుండానే అటవీ ప్రాంతంలోని గనులకు ఈ-వేలం నిర్వహించినట్టు జిల్లా అటవీ శాఖ తేల్చడం గమనార్హం.

### అసలేం జరిగింది?

తెలంగాణ గనుల శాఖ 2024 ఆగస్టులో సూర్యాపేట జిల్లాలోని అటవీ ప్రాంతంలో మూడు సున్నపురాయి గనుల (పసుపులబోడు, సైదుల్‌నామా, సుల్తాన్‌పూర్)కు ఈ-టెండర్ నోటిఫికేషన్ జారీచేసింది. ఈ మూడు బ్లాకుల్లో.. ఏ కంపార్టుమెంట్‌లో, ఎంత విస్తీర్ణంలో ఈ-వేలం నిర్వహిస్తున్నామనే వివరాలను లాంగిట్యూడ్, లాటిట్యూడ్ మూలల వివరాలు (డీజీపీఎస్-డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం కార్నర్ పాయింట్లు) సహా ఇవ్వాల్సి ఉన్నది. కేంద్ర గనుల శాఖ మార్గదర్శకాలకు తిలోదకాలిచ్చి రాష్ట్ర గనుల శాఖ నోటిఫికేషన్ జారీ చేయడంపై తీవ్రస్థాయిలో ఆరోపణలు వచ్చాయి. సైదుల్‌నామా బ్లాకులోని దక్కన్ సిమెంట్స్ లిమిటెడ్, సుల్తాన్‌పూర్ బ్లాకులోని అటవీ ప్రాంతంలో నాగార్జున సిమెంట్స్ లిమిటెడ్ కు సంబంధించిన అక్రమ మైనింగ్ కేసులు హైకోర్టులో పెండింగులో ఉన్నాయి. గనుల శాఖ డీజీపీఎస్ కార్నర్ పాయింట్లు లేకుండా ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం నిర్వహించిన ఈ-టెండర్లలో ఆయా బ్లాకులు ఆ కంపెనీలకే దక్కడం అనుమానాలకు తావిస్తున్నది. ఎలాంటి ఆరోపణలులేని పసుపులబోడు బ్లాకుకు పోటీ లేకపోవడంతో అధికారులు దానిని రద్దుచేశారు. గత ఏడాది డిసెంబర్ 20న దీనిపై సామాజిక కార్యకర్త వెంకట్‌రెడ్డి కేంద్రానికి ఫిర్యాదు చేశారు. సికింద్రాబాద్ ఎంపీ కిషన్‌రెడ్డి మంత్రిగా ఉన్న గనుల శాఖకే ఫిర్యాదు చేయగా, మూడు నెలల తర్వాత ఆ శాఖ నుంచి జవాబు రావడం గమనార్హం. కేంద్ర మంత్రిత్వ శాఖలకు వచ్చే ఫిర్యాదులను 45 రోజుల్లో పరిష్కరించాలనే మార్గదర్శకాలు గతంలో ఉండేవి. దానిని 30 రోజులకు తగ్గించినట్టు తెలిసింది. కేంద్ర గనుల శాఖ జారీ చేసిన గెజిట్‌లోని మార్గదర్శకాలకు తిలోదకాలిచ్చి తెలంగాణ గనుల శాఖ ఈ-వేలం నిర్వహించిందని ఫిర్యాదు చేస్తే నిర్ణీత సమయంలోగా స్పందించకపోవడం గమనార్హం. గత మార్చి 18న స్పందించిన కేంద్ర గనుల శాఖ సదరు ఫిర్యాదును తెలంగాణ గనుల శాఖకు పంపినట్టు సమాధానమిచ్చింది. ఆలస్యంగా స్పందించడంతోపాటు భారీ స్కాం జరిగిందని ఫిర్యాదు చేసినా కేంద్రం స్పందించకపోవడంపై వెంకట్‌రెడ్డి సంబంధిత వెబ్‌సైట్‌లోనే రిమార్కు కాలంలో అసంతృప్తిని వ్యక్తపరిచారు.

### అసలు విషయాన్ని బయటపెట్టిన అటవీ శాఖ

ఇదే అంశంపై వెంకట్‌రెడ్డి.. సూర్యాపేట జిల్లా అటవీ శాఖ అధికారికి సమాచార హక్కు చట్టం కింద వివరాల కోసం దరఖాస్తు చేశారు. తెలంగాణ గనుల శాఖ ఈ-వేలం నిర్వహించిన మూడు బ్లాకులకు సంబంధించిన కంపార్టుమెంట్లు, ఎన్‌వోసీ వివరాలను ఇవ్వాల్సిందిగా కోరారు. ఆ మూడు బ్లాకుల్లో అసలు కంపార్టుమెంట్లుగా విభజించలేదని, జిల్లా అటవీ శాఖ ఎన్‌వోసీ జారీ చేయలేదని జిల్లా అటవీ శాఖ అధికారి స్పష్టంచేశారు. అటవీ శాఖ అనుమతి లేకుండానే అటవీ ప్రాంతంలోని మూడు సున్నపురాయి బ్లాకులకు గనుల శాఖ అధికారులు ఈ-వేలం నిర్వహించడం ఏమిటని వెంకట్‌రెడ్డి ప్రశ్నిస్తున్నారు. అక్రమ మైనింగ్ ఆనవాళ్లు చెరిపివేసేందుకే ఈ-వేలంలో అవకతవకలకు పాల్పడ్డారని, ఇది దాదాపు రూ.1,500 కోట్ల స్కాం అని వెంకట్‌రెడ్డి ఆరోపిస్తున్నారు. ఈ-వేలం వ్యవహారంలో తాము జారీ చేసిన మార్గదర్శకాలకు రాష్ట్ర గనుల శాఖ తిలోదకాలు ఇచ్చినా, కేంద్రం స్పందించకపోవడం ఏమిటని ఆయన విస్మయం వ్యక్తంచేశారు. ఈ అంశాన్ని సుప్రీం కోర్టులోనే తేల్చుకుంటానని స్పష్టంచేశారు.

### చట్టానికి తూట్లు పొడిచిన విధానమిది

తెలంగాణ గనులు, భూగర్భ శాఖ.. ఖనిజ నిక్షేపాలున్న రిజర్వు ఫారెస్టులోని ప్రాంతాలను వేల ఎకరాల విస్తీర్ణంలోని బ్లాకులుగా... ఆపై వాటిలోనే కంపార్టుమెంట్లుగా విభజిస్తుంది. ఆ మేరకు రికార్డుల్లో కంపార్టుమెంట్ల నంబర్లను కూడా నమోదు చేస్తారు. గత ఏడాది ఇచ్చిన ఈ-టెండర్ నోటిఫికేషన్‌లో సుల్తాన్‌పూర్, సైదుల్‌నామా, పసుపులబోడు బ్లాకుల్లో కొంత విస్తీర్ణంలో సున్నపురాయి మైనింగ్ లీజు వేలం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. సైదుల్‌నామా బ్లాకులో 421.9 ఎకరాల్లో వేలం లీజు చేపట్టారు. వాస్తవానికి సైదుల్‌నామా బ్లాకులోని అటవీ ప్రాంత విస్తీర్ణం సుమారు 3,102 ఎకరాలు. దీనిని 25, 26, 27 బ్లాకులుగా విభజించారు. కానీ, నోటిఫికేషన్‌లో ఎక్కడా కంపార్టుమెంట్ నంబర్ పొందుపరచలేదు. బ్లాకు పూర్తి విస్తీర్ణంలో మైనింగ్ లీజుకు ఇచ్చే విస్తీర్ణం కేవలం 16.82%. మరి అంత పెద్ద బ్లాకులో ఈ ప్రాంతం ఎక్కడ అని నిర్ధారించుకోవాలి?

- సుల్తాన్‌పూర్ బ్లాకులో వేలం లీజు విస్తీర్ణం 337.7 ఎకరాలు. వాస్తవానికి ఈ బ్లాకులోని అటవీ ప్రాంత విస్తీర్ణం 4,260.09 ఎకరాలు. ఇందులో 11,12,13, 14, 804 అనే బ్లాకులు ఉన్నాయి. నోటిఫికేషన్‌లో ఎక్కడా బ్లాకులను పొందుపరచలేదు. అంటే లీజు ఇచ్చే విస్తీర్ణం పూర్తి విస్తీర్ణంలో కేవలం 7.92 శాతంగా ఉంటే ఆ రిజర్వు ఫారెస్టులో ఏ మూలకు, ఎక్కడ మైనింగ్ చేయాలని ప్రభుత్వం చెప్తుంది? దాని హద్దులను నిర్ధారించేది ఎలా?
- పసుపులబోడు బ్లాకులో ప్రభుత్వం చేపట్టిన వేలం లీజు విస్తీర్ణం 343.20 ఎకరాలు. దీని పూర్తి విస్తీర్ణం 2,490.52 ఎకరాలు. ఈ బ్లాకులో 29,30,31 బ్లాకులు ఉన్నాయి. గనులు, భూగర్భ శాఖ ఇచ్చిన టెండర్ నోటిఫికేషన్‌లో ఈ బ్లాకుకు సంబంధించి మాత్రం కంపార్టుమెంటు-29 అని పేర్కొన్నారు. ఇందులోనూ హద్దులను (డీజీపీఎస్ కార్నర్ పాయింట్లు) ఇవ్వలేదు. ఈ క్రమంలో లీజు ఇచ్చే విస్తీర్ణం 13.78% మాత్రమే. కంపార్టుమెంటు-29లో ఎక్కడ మైనింగ్ చేయాలని సూచిస్తున్నారో తెలియని పరిస్థితి.
- వాస్తవానికి డీజీపీఎస్ కార్నర్ పాయింట్లు సహా కచ్చితంగా ఈ హద్దులు ఉన్న ప్రాంతంలోనే మైనింగ్ చేపట్టాలనే అంశాన్ని నోటిఫికేషన్‌లోనే పొందుపరచడం పెద్ద కష్టమేమీ కాదు. పైగా ఆ వివరాలన్నీ శాఖ రికార్డుల్లో కూడా ఉంటాయి. కానీ, నోటిఫికేషన్‌లో ఇవ్వకపోవడం వెనక ఏదో మతలబు దాగి ఉన్నదనే ఆరోపణలున్నాయి.

### మూడో మనిషికి తెలిసేదెట్లా?

ఈ-టెండర్ నోటిఫికేషన్‌లోనే డీజీపీఎస్ కార్నర్ పాయింట్లను అక్షాంశాలు, రేఖాంశాలు సహా ఇవ్వాల్సి ఉన్నది. కానీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కార్నర్ పాయింట్లు ఇవ్వకపోగా కనీసం ఆయా బ్లాకుల్లోని ఏ కంపార్టుమెంటు అనేది కూడా బహిర్గతం చేయకపోవడం గూడుపుఠాణీ జరిగిందనే అనుమానాన్ని రేకెత్తిస్తున్నది. ఈ-టెండర్ నోటిఫికేషన్‌లోని 'ఖనిజ మైనింగ్ బ్లాక్ సారాంశం (సమ్మరీ)' 1(2) కార్నర్ పాయింట్లు (లాటిట్యూడ్, లాంగిట్యూడ్) అనే కాలమ్‌లో 'డీజీపీఎస్ కార్నర్ పాయింట్లను 'అనుబంధం 1బీ'లో ప్రచురించాం అని పేర్కొన్నారు. అంటే టెండరు నిబంధనల ప్రకారం రూ.5 లక్షలు చెల్లించి బిడ్ కొనుగోలు చేసిన వారికి మాత్రమే ఇస్తామనేది దాని సారాంశం. అయినవారు కాకుండా కానివారు ఎవరైనా బిడ్ కొనుగోలు చేసినప్పుడైనా డీజీపీఎస్ కార్నర్ పాయింట్లు ఇచ్చారా? లేదా? అనేది కూడా అంతుబట్టని అంశం. ఈ నేపథ్యంలో రిజర్వు ఫారెస్టులోని ఆ బ్లాకుపై పూర్తి అవగాహన ఉన్నవారికి మాత్రమే ఆ వివరాలు తెలిసే అవకాశం ఉంటుంది. తద్వారా కొత్తవారు ఎవరూ ఈ టెండర్లలో పాల్గొనేందుకు ముందుకురారు. పైగా మైనింగ్ లీజు వేలం ఇస్తున్న విస్తీర్ణం పూర్తి బ్లాకు విస్తీర్ణంతో పోలిస్తే 7-16% వరకు మాత్రమే ఉన్నది. ఈ క్రమంలో ప్రభుత్వం చెప్తున్న ఆ ప్రాంతం ఎక్కడ, ఏ మూలకు ఉన్నది? వేలం దక్కించుకున్న కంపెనీలు ఎక్కడ మైనింగ్ చేయాలి? ఇష్టానుసారంగా మైనింగ్ చేస్తే దానికి లెక్క, ప్రాతిపదిక ఏముంటుంది? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.




### అభియోగాలున్న వారికే ఆయా బ్లాకులు!

కేంద్ర ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఉద్దేశపూర్వకంగానే సున్నపురాయి మైనింగ్ లీజు వేలం ఈ-టెండర్ల ప్రక్రియను నిర్వహించారనేందుకు మరింత బలాన్ని చేకూర్చేలా ఆయా బ్లాకుల్లో అభియోగాలున్న సిమెంటు కంపెనీలే ఆ బ్లాకులో లీజు వేలాన్ని దక్కించుకోవడం గమనార్హం.

## సమాచారమివ్వమంటే వ్యక్తుల ప్రాణాలతో ముడి...

న్యాయస్థానాల్లో అక్రమ మైనింగ్‌పై కేసులు పెండింగులో ఉన్నప్పటికీ, ప్రభుత్వం వేలం టెండర్ల ప్రక్రియను చేపట్టినందున తిరిగి సామాజిక కార్యకర్త వెంకట్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో అసలు టెండర్ల ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని ఇవ్వాల్సిందిగా సమాచార హక్కు చట్టం కింద సంబంధిత శాఖకు దరఖాస్తు చేసుకోగా, రాష్ట్రంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఖనిజాల మైనింగ్, అనుబంధ కార్యకలాపాల వల్ల ప్రభుత్వానికి రూ.5 వేల కోట్ల ఆదాయం వస్తుందని గనులు, భూగర్భ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (న్యాయ) ఆర్ రామకృష్ణారెడ్డి సమాధానమిచ్చారు. అయితే, వెంకట్‌రెడ్డి తన దరఖాస్తులో కోరిన టెండర్ల ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని ఇచ్చేందుకు మాత్రం నిరాకరిస్తున్నట్టు అసిస్టెంట్ డైరెక్టర్ తన లేఖలో పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం-8(ఏ),(డీ),(ఇ),(జీ),(ఐ)ను అనుసరించి సమాచారాన్ని బహిర్గతం చేయలేమని అందులో స్పష్టంచేశారు. అయితే ఆర్టీఐ చట్టంలోని ఈ సెక్షన్లను పరిశీలించగా.. వ్యక్తుల ప్రాణాలకు హాని ఉన్నప్పుడు సమాచారాన్ని బహిర్గతం చేయలేమని తేలింది. అంటే ఇప్పుడు సున్నపురాయి గనుల లీజు వేలం సమాచారాన్ని బయటపెడితే ఎవరి ప్రాణాలకు హాని కలుగుతుంది? ప్రాణహాని ఎవరు తలపెడతారు? అనే సందేహాలు తలెత్తుతున్నాయి. ఇలాంటి విచిత్ర పరిణామాలు చోటుచేసుకున్న నేపథ్యంలో సామాజిక కార్యకర్త వెంకట్‌రెడ్డి ఈ వ్యవహారంపై కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ)కు ఫిర్యాదు చేయగా... ఫిర్యాదును నమోదు చేసుకొని పరిశీలిస్తున్నట్టు సీవీసీ స్పష్టం చేసింది.

## బస్టాండ్లలో శానిటరీ నాప్కిన్ వెండింగ్ మిషన్లు

**పోస్టర్ ఆవిష్కరించిన మంత్రులు సీతక్క, పొన్నం**

హైదరాబాద్, మే 16 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ బస్టాండ్‌లు, బస్ డిపోల్లో శానిటరీ నాప్కిన్ వెండింగ్ మిషన్లు ఏర్పాటు చేయనున్నట్టు మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ తెలిపారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా సహేలీ స్వచ్ఛంద సంస్థ సహకారంతో తొలుత ములుగు, హనుమకొండ బస్టాండ్‌లో ఈ మిషన్లను ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలకు విస్తరిస్తామని తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలోనే ఆర్టీసీ బస్టాండ్‌లో తొలిసారిగా శానిటరీ నాప్కిన్ వెండింగ్ మిషన్లను అందుబాటులోకి తెస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలువబోతున్నదని చెప్పారు. సహేలీ సంస్థ వ్యవస్థాపకురాలు కొమ్ము అనుపమకు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

## త్వరలో 14నూతన ఎక్సైజ్‌సేషన్లు ప్రారంభం

**వారంలోనే బదిలీల ప్రక్రియ ప్రారంభం : మంత్రి జూపల్లి**

హైదరాబాద్, మే 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన 14ఎక్సైజ్ స్టేషన్లను త్వరలోనే ప్రారంభించనున్నట్టు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. వచ్చేవారంలోనే ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నుంచి కానిస్టేబుల్ వరకూ అర్హులైన సిబ్బంది అందరికీ బదిలీలు చేపడతామని ఆయన వెల్లడించారు. శుక్రవారం మంత్రి జూపల్లిని ఆయన నివాసంలో ఎక్సైజ్ అధికారులు కలిసి పలు సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. పదోన్నతుల అంశంతో బదిలీలు ముడిపెట్టడంతో బదిలీల ప్రక్రియ ఆలస్యమైందని పేర్కొన్నారు. ఈ క్రమంలో బదిలీల ప్రక్రియకు ఎలాంటి అడ్డంకులు లేకపోవడంతో దానిని వేగంగా చేపడుతున్నట్టు తెలిపారు. ఇందుకు మార్గదర్శకాలను రూపొందించి ఆమోదించామని పేర్కొన్నారు. విధి విధానాలను మరో నాలుగు రోజుల్లో విడుదల చేస్తామని జూపల్లి వెల్లడించారు. మంత్రిని కలిసిన వారిలో ఎక్సైజ్ సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

## మంత్రులంతా అవినీతి అనకొండలే!

- మంత్రి సురేఖ వ్యాఖ్యలు సర్కారు అవినీతికి నిదర్శనం
- కొండా కామెంట్స్‌పై రాహుల్ గాంధీ స్పందించాలి
- కాంగ్రెస్ కరప్షన్‌పై సభా కమిటీ వేయాలి
- బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి



మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఖలీల్‌వాడి, మే 16: కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులంతా అవినీతి అనకొండ లేనని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఆరోపించారు. మంత్రులకు లంచాలు ఇవ్వనిదే ఫైళ్లు ముందుకు కదలవని శుక్రవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. సచివాలయమంతా అవినీతి కంపు కొడుతున్నదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే కమీషన్ల పాలన అని, ఇది తాము అంటున్నది కాదని, ఫైళ్లు క్లియర్ చేయడానికి మంత్రులకు డబ్బులు ఇవ్వాల్సిందేనని మంత్రి కొండా సురేఖ కుండబద్దలు కొట్టినట్టు చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ఆమె మాటలు కాంగ్రెస్ సర్కారు అంతులేని అవినీతికి నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. మంత్రి సురేఖ వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ స్పందించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డే పెద్ద అవినీతి భూతమని ఆరోపించారు. పీసీసీ అంటేనే ప్రదేశ్ కరెప్షన్ సెంటర్ అని, అది ఇండియన్ నేషనల్ క్రైమ్ అండ్ కరప్షన్ పార్టీ అని జీవన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఇందిరమ్మ రాజ్యమంటేనే ల్యాండ్, శాండ్, మైన్, వైన్ మాఫియా అని దుయ్యబట్టారు. అవినీతి పాఠాల్లో కాంగ్రెస్‌కు ఫస్ట్ మార్క్ అని పేర్కొన్నారు.

### ప్రభుత్వ అవినీతిని మంత్రి ధ్రువీకరించారు

రాష్ట్రంలో కమిషన్ల పాలన నడుస్తున్నది. నిజం నిప్పు లాంటిది, దాచితే దాగదు. ప్రభుత్వం ఎంత ఆపాలని ప్రయత్నించినా, మంత్రి నోటి నుంచి నిజం బయటికి వచ్చింది. ఏ శాఖలో చూసినా ఏ పనికి ఎంత? అనేది లెక్కించి వసూలు చేస్తున్న విషయం రాష్ట్రమంతా మాట్లాడుతున్నది. దీనిని మంత్రి కొండా సురేఖ అధికారికంగా ధ్రువీకరించారు. సీఎంకు చిత్తశుద్ధి ఉంటే మంత్రి చేసిన ఆరోపణలపై విచారణకు ఆదేశించాలి.

**- మాజీ మంత్రి కొప్పుల**

## మంత్రి సురేఖ ప్రెస్‌మీట్‌లో పవర్ కట్

- కాంగ్రెస్ సర్కారు గొప్పలు చెప్పేటప్పుడే నాలుగున్నర నిమిషాలపాటు విద్యుత్తు సరఫరాలో అంతరాయం



కరెంట్ పోవడంతో చీకట్లోనే మాట్లాడుతున్న కొండా సురేఖ

నయీంనగర్, మే 16 : కాంగ్రెస్ పాలనలో కరెంటు పోవడం రివాజుగా మారింది. మంత్రి కొండా సురేఖ ప్రెస్‌మీట్‌లో మరోసారి ఇదే జరిగింది. శుక్రవారం హనుమకొండలోని తన నివాసంలో మంత్రి కొండా సురేఖ కొందరు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. కమీషన్ వ్యాఖ్యలపై వివరణ ఇచ్చుకునే ప్రయత్నంలో కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల గురించి వివరిస్తున్న సమయంలో కరెంట్ పోయింది. నాలుగున్నర నిమిషాల పాటు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. కాంగ్రెస్ సర్కారు కరెంటు ఇస్తున్నదని చెప్పే సందర్భంలో మంత్రి ప్రెస్‌మీట్‌లో కరెంటు పోయిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## కమీషన్లు ఫుల్..

మొదటిపేజీ తరువాయి...

మాట్లాడుతూ.. 'నేను మంత్రిని కాబట్టి నా దగ్గరికి కొన్ని కంపెనీలకు సంబంధించిన ఫైల్స్ క్లియరెన్స్ కోసం వస్తాయి. మామూలుగా మంత్రుల వద్దకు అలాంటి ఫైల్స్ వచ్చినప్పుడు డబ్బులు తీసుకొని క్లియర్ చేస్తారు' అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని మంత్రుల అవినీతికి కొండా సురేఖ వ్యాఖ్యలు నిలువుటద్దమని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వంపై విచ్చలవిడి ఆరోపణలు వస్తున్న విషయాన్ని గుర్తుచేస్తున్నారు. ఒక్కరు కాదు..ఇద్దరు కాదు.. మంత్రివర్గంలో సీఎం సహా 12మంది మంత్రులు ఉండగా, ఒకరిద్దరు మినహా అందరిపైనా అవినీతి ఆరోపణలు రావడంతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని 'కమీషన్ల ప్రభుత్వం'గా విపక్షాలు దుమ్మెత్తిపోస్తున్నాయి. 10% కమీషన్లతో మొదలై 20%, 30% అంటూ మంత్రులపై ఆరోపణలు రావడాన్ని గుర్తు చేస్తున్నారు. ఆర్ ట్యాక్స్ వసూళ్లపై తాజాగా రియల్టర్లు రాహుల్‌గాంధీకి లేఖ రాయగా, ఆర్‌ఆర్ ట్యాక్స్ అంటూ ఏకంగా ప్రధాని మోదీ ఆరోపించిన సంగతి తెలిసిందే. ఇవన్నీ నిజమేనని కొండా సురేఖ తన వ్యాఖ్యలతో నిర్ధారించారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

### 8 శాతం నుంచి 30 శాతం దాకా..

'కాంగ్రెస్ పాలన అంటే కమీషన్లు, కలెక్షన్లు, కరప్షన్' అని ఇప్పటికే ప్రతిపక్షాలు ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పార్లమెంటు ఎన్నికల ముందు ఖజానా నుంచి పెద్ద ఎత్తున కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు జరిగింది. ఆ సమయంలో 'గట్టి' ట్యాక్స్ చెల్లించిన వారికే బిల్లులు మంజూరయ్యాని విమర్శలు వచ్చాయి. ఎనిమిది శాతం కమీషన్లను ఓ మంత్రి భార్య స్వయంగా వసూలు చేశారని ఆరోపణలు వచ్చాయి. దీంట్లో అధిష్ఠానానికి వాటాలు పంపాల్సి ఉంటుందని వారు చెప్పినట్టు పెద్ద ఎత్తున చర్చ జరిగింది. పార్లమెంటు ఎన్నికల తర్వాత కూడా ఇదే విధానం కొనసాగుతున్నదని, పైగా కమీషన్ రెట్టింపు అయ్యిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎమ్మెల్యేలు పనులు తెచ్చుకోవాలని, 'నిర్దేశిత' కమిషన్ తీసుకొని రూ.5 కోట్ల వరకు బిల్లులు విడుదల చేస్తామని, ఆపైన మీ ఇష్టమున్నంత వేసుకోవచ్చు'అని చెప్పినట్టు ప్రచారం జరిగింది. ఆ సమయంలో ఎమ్మెల్యేలు బిల్లుల కోసం కాంట్రాక్టర్ల చుట్టూ, ప్రభుత్వ పెద్దల చుట్టూ తిరగడం కనిపించిందని సచివాలయ వర్గాల్లో గుసగుసలు వినిపించాయి. ఇక.. అధికారంలోకి వచ్చినప్పుడు 8 శాతంగా కమీషన్ ఇప్పుడు 30 శాతానికి చేరిందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎవరో ఆషామాషీగా అన్నది కాదని.. అధికార పార్టీ ఎమ్మెల్యేలే ఆరోపించారని చెప్తున్నారు. ఓ మంత్రి 30% కమీషన్ అడుగుతున్నారని, దీనికి వ్యతిరేకంగా పదిమంది ఎమ్మెల్యేలు రహస్యంగా భేటీ కావడం అప్పట్లో కలకలం సృష్టించింది. ఆ భేటీ చివరకు అధిష్ఠానం దృష్టికి కూడా వెళ్లింది. ఇక మంత్రులు వసూలు చేస్తున్న కమీషన్లను వ్యతిరేకిస్తూ కొందరు కాంట్రాక్టర్లు ఏకంగా సచివాలయంలోనే ధర్నాకు దిగడం సంచలనం సృష్టించింది. ఇక ఓ మంత్రి వివాదాస్పద భూములను సెటిల్మెంట్ చేసి, సగం భూమిని వాటాగా తీసుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. మైనింగ్ లీజులు, క్రషర్ల లీజులు, ఇసుక క్వారీల్లో బలవంతంగా వాటాలు రాయించుకుంటున్నారన్న చర్చ కూడా జరుగుతున్నది.

### వాస్తవాలు మాట్లాడిన సురేఖకు ధన్యవాదాలు

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కమీషన్ సర్కారు నడుస్తున్నది..గతంలో కాంట్రాక్టర్లు ఏకంగా సచివాలయంలోనే ధర్నాలు చేసి ఓ మంత్రికి 30 శాతం ముట్ట జెప్పందే బిల్లులు రావడంలేదని ఎండగట్టారు. ప్రజల్లోనూ ఇదే చర్చ నడుస్తున్నది. వెంటనే కమీషన్లు తీసుకుంటున్న మంత్రుల పేర్లు కొండా సురేఖ బయటపెట్టాలి. ఏదేమైనా వాస్తవాలు మాట్లాడిన కొండా సురేఖకు హృదయ పూర్వక ధన్యవాదాలు.

**- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

### ఆర్ఆర్ ట్యాక్స్‌పై ప్రధాని ఆరోపణలు.. రాహుల్‌కు ఫిర్యాదు

రియల్ ఎస్టేట్ రంగంపై 'ఆర్ ట్యాక్స్' నడుస్తున్నదని మొదటినుంచీ ఆరోపణలున్నాయి. ముఖ్యనేతకు చెందిన బంధువులు, అనుచరులు ఓ గ్రూప్‌గా ఏర్పడి వసూళ్లకు పాల్పడుతున్నట్టు రియల్టర్లు ఆరోపిస్తున్నారు. తాజాగా ఈ వ్యవహారంపై ఏకంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని కలిసి ఫిర్యాదు చేసినట్టు ప్రచారం జరిగింది. రాష్ట్రంలో ఆర్ఆర్ ట్యాక్స్‌పై ఏకంగా ప్రధాని మోదీ ఆరోపణలు చేశారు.

### మీ మాటలతో పరువుపోతున్నది..

మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారడంతో కాంగ్రెస్ ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు దిగినట్టు తెలిసింది. ఓ మంత్రి రంగంలోకి దిగారని.. శుక్రవారం ఉదయమే ఆమెకు ఫోన్ చేసి 'ఏం అమ్మా.. మీరు చేసిన వ్యాఖ్యలతో ప్రభుత్వ పరువు గంగలో కలుస్తున్నది. సీఎం కూడా ఈ విషయంపై సీరియస్‌గా ఉన్నారు' అంటూ అసహనం వ్యక్తంచేసినట్టు సమాచారం.

## ఖజానా డల్

మొదటిపేజీ తరువాయి...

తొలిసారి తిరోగమనం నమోదైంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ ప్రకారం.. అన్ని రకాల ఆదాయ మార్గాల్లో కలిపి రూ.2,21,242.23 కోట్ల రెవెన్యూ రాబడులు వస్తాయని ప్రభుత్వం అంచనా వేసింది. కానీ.. రూ.1,67,804.32 కోట్లు మాత్రమే వచ్చింది. అంచనా వేసిన దాంట్లో వచ్చింది 75.85% మాత్రమే. అంతకుముందు సంవత్సరంలో 78.08% రాగా.. నిరుడు దాదాపు రెండున్నర శాతం తగ్గింది. సాధారణంగా ఏటికేడు రాబడి పెరగాల్సిందిపోయి 2023-24తో పోల్చితే నిరుడు రూ.1285 కోట్లు తగ్గినట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2023-24లో రెవెన్యూ రాబడులు రూ.1,69,089 కోట్లు రాగా.. 2024-25లో రూ.1,67,804 కోట్లకు తగ్గింది.

### పడిపోయిన 'పన్ను' ఆదాయం

ఖజానాకు వచ్చే రాబడిలో 'పన్ను ఆదాయం' ప్రధానమైనది. స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్, జీఎస్టీ.. ఇలా పన్నుల రూపంలో రాష్ట్రానికి ఆదాయం వస్తుంది. ఈ పన్నుల రాబడి బాగుంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగున్నట్టు చెప్తుంటారు. ఈ ఏడాది ప్రభుత్వం రూ.1,64,397.64కోట్ల మేర ట్యాక్స్ రెవెన్యూ వస్తుందని అంచనా వేయగా రూ. 1,36,283.47కోట్లు మాత్రమే వచ్చింది. లక్ష్యంలో ఇది 82.90 శాతం. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి విశ్లేషిస్తే ఇదే అతి తక్కువ. కొవిడ్ సెకండ్ వేవ్ విజృంభించిన 2021-22 ఆర్థిక సంవత్సరంలోనూ అంచనాలకు మించి ఆదాయం నమోదైనట్టు గణాంకాలు చెప్తున్నాయి. ఈసారి 83 శాతానికే పరిమితం కావడం గమనార్హం.

### కుప్పకూలిన రియల్ ఎస్టేట్ రంగం..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మొదటి నెల నుంచే రియల్ ఎస్టేట్ రంగం కుదేలవడం మొదలైంది. ఫార్మాసిటీని రద్దు చేస్తున్నట్టు 2023 డిసెంబర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినప్పటి నుంచే కష్టకాలం మొదలైందని మార్కెట్ నిపుణులు మొత్తుకుంటున్నారు. ఆ తర్వాత హైడ్రాను తెరమీదికి తెచ్చి ఇష్టారాజ్యంగా కూల్చివేతలు చేపట్టడం, మూసీ పునర్జీవ ప్రాజెక్టు పేరుతో నది పరీవాహక ప్రాంతంలోని భవనాలను కూల్చేస్తారని ప్రకటించడంతో రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలింది. ఫోర్త్ సిటీ పేరుతో హడావుడి చేసినా, చివరికి ఫార్మాసిటీ కొనసాగుతుందని చెప్పడంతో అక్కడా తుస్సుమన్నది. కీలకమైన వ్యవసాయం, పారిశ్రామికం తదితర రంగాల్లో మందగమనంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా దెబ్బతిన్నది. ఇందుకు ప్రభుత్వం చెప్పిన గణాంకాలే నిదర్శనం. ఈ ఏడాది స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖకు రూ.18,228 కోట్ల ఆదాయం అంచనా వేయగా, రూ. 8,473 కోట్లు మాత్రమే వచ్చింది. అంటే.. కేవలం 46.48 శాతం మాత్రమే.

**బడ్జెట్ అంచనాల్లో రెవెన్యూ రాబడులు**

| | |
|---|---|
| 2015-16 | 77.43% |
| 2016-17 | 81.15% |
| 2017-18 | 78.45% |
| 2018-19 | 77.43% |
| 2019-20 | 90.67% |
| 2020-21 | 69.79% కొవిడ్‌కాలం |
| 2021-22 | 72.37% కొవిడ్‌కాలం |
| 2022-23 | 82.55% |
| 2023-24 | 78.08% |
| 2024-25 | 75.85% |

**బడ్జెట్ అంచనాల్లో సాధించిన పన్ను ఆదాయం**

| | |
|---|---|
| 2015-16 | 85.66% |
| 2016-17 | 91.95% |
| 2017-18 | 91.61% |
| 2018-19 | 89.54% |
| 2019-20 | 93.87% |
| 2020-21 | 77.76% కొవిడ్ కాలం |
| 2021-22 | 102.89% కొవిడ్ కాలం |
| 2022-23 | 100.01% |
| 2023-24 | 88.88% |
| 2024-25 | 82.90% |

| సంవత్సరం | జీఎస్టీ వసూళ్లు |
|---|---|
| 2018-19 | 84.09% |
| 2019-20 | 89.95% |
| 2020-21 | 79.29% (కరోనా) |
| 2021-22 | 97.10% |
| 2022-23 | 99.29% |
| 2023-24 | 91.28% |
| 2024-25 | 85.92% |

### జీఎస్టీ వసూళ్లలోనూ క్షీణతే

2024-25లో జీఎస్టీ ఆదాయం రూ.58,594.91 కోట్లు వస్తుందని ప్రభుత్వం భావించగా రూ.50,343.46కోట్లే వచ్చింది. ఇది బడ్జెట్ అంచనాల్లో 85.92% మాత్రమే. గత ఏడాది 91.28%నమోదుకాగా.. ఈసారి దాదాపు ఆరు% తగ్గింది. రియల్ ఎస్టేట్ రంగం కుదేలవడం, వ్యవసాయరంగం, పారిశ్రామిక, సేవ వంటి కీలకరంగాలన్నీ కుదేలు కావడంతో ఆ ప్రభావం కొనుగోళ్లపై పడిందని, ఫలితంగా జీఎస్టీ వసూళ్లు తగ్గిపోయాయని విశ్లేషకులు చెప్తున్నారు. 2018-19 ఆర్థిక సంవత్సరం నుంచి జీఎస్టీ వసూళ్లను లెక్కించడం ప్రారంభించగా.. 2022-23 వరకు కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఏటికేడు వృద్ధిని నమోదు చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జీఎస్టీ వసూళ్లు పతనం అవుతున్నాయని గణాంకాలు చెప్తున్నాయి.

## ఆర్థిక ఎమర్జెన్సీ కోసం సీఎం ఆరాటం

- సంక్షేమ పథకాలు ఎగ్గొట్టేందుకు పన్నాగం
- మంత్రివర్గ విస్తరణను ఆపుతున్నదీ రేవంత్‌రెడ్డే
- సీఎంకు, డిప్యూటీ సీఎంకు విభేదాలున్నాయి
- లోకల్ బాడీ ఎన్నికల తరువాత సీఎంను మార్చే అవకాశం
- బీజేపీఎల్పీ నేత ఏలేటి



హైదరాబాద్, మే 16 (నమస్తే తెలంగా ణ): రాష్ట్రంలో ఆర్థిక ఎమర్జెన్సీని ప్రకటించి, సంక్షేమ పథకాలు, ఉద్యోగుల బకాయిలను ఎగ్గొట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. శుక్రవారం మీడియా చిట్‌చాట్ నిర్వహించిన మహేశ్వర్‌రెడ్డి పలు అంశాలపై సంచలన వ్యాఖ్యలు చేశా రు. రాష్ట్రం దివాలా తీసిందని సీఎం చెప్తుంటే, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. సీఎం రేవంత్, భట్టికి మధ్య విభేదాలున్నాయన్నారు. మంత్రివర్గ విస్తరణను రేవంత్‌రెడ్డే ఆపుతున్నాడని పేర్కొన్నారు. మంత్రిమండలి రెండుగా చీలిపోయిందని చెప్పారు. సీఎంను వ్యతిరేకించే మంత్రులు రాష్ట్ర పరిస్థితులపై ఎప్పటికప్పుడు రాహుల్‌గాంధీకి నివేదికలు ఇస్తున్నారని పేర్కొన్నారు. కడుపు కట్టుకుంటే రూ.40 వేల కోట్లు వస్తాయని చెప్పిన రేవంత్‌రెడ్డి, ఇప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదంటూ రాష్ట్రాన్ని, కాంగ్రెస్ పార్టీని నాశనం చేస్తున్నారనే అంతర్మథనంలో మంత్రులు ఉన్నారని వివరించారు. ఉద్యోగుల విషయంలో రేవంత్ చేసిన వ్యాఖ్యలపై కూడా మంత్రివర్గంలో విభేదాలు వచ్చాయని పేర్కొన్నారు.

### మంత్రుల శాఖల్లో సీఎం జోక్యం

సమీక్షలను సీఎం తన నివాసంలో నిర్వహిస్తుండటంతో సీనియర్ మంత్రులు ఇబ్బంది పడుతున్నారని, కొన్ని శాఖల్లో సీఎం జోక్యం మంత్రులకు నచ్చడం లేదని మహేశ్వర్‌రెడ్డి చెప్పారు. భూముల వ్యవహారంలో ముఖ్యమంత్రికీ, రెవెన్యూ మంత్రికి మధ్య గ్యాప్ పెరిగిందని పేర్కొన్నారు. లోకల్‌బాడీ ఎన్నికల తర్వాత ఏ క్షణంలోనైనా ముఖ్యమంత్రి మార్పు జరుగవచ్చని మహేశ్వర్‌రెడ్డి జోస్యం చెప్పారు. లోకల్‌బాడీ ఎన్నికల కోసం అటు కాంగ్రెస్ హైకమాండ్, ఇటు రాష్ట్ర నేతలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని చెప్పారు. సీఎం మీద వస్తున్న అనేక ఆరోపణల ఫైల్ రాహుల్‌గాంధీ దగ్గర ఉన్నదని, వారి మధ్య గ్యాప్ కొనసాగుతున్నదని పేర్కొన్నారు. అందుకే రాహుల్‌గాంధీ ఇటీవల హైదరాబాద్ వచ్చినా.. రేవంత్‌ను పలకరించలేదని చెప్పారు.